తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం-04- నవంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 156 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# చేవెళ్ల సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

## ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ, 20 మంది మృతి

- హైదరాబాద్–బీజాపూర్ రోడ్డుపై విషాదం
- ఢీకొట్టిన తీవ్రతకు బస్సు ధ్వంసం
- పోలీసులు, స్థానికుల సహాయక చర్యలు
- లారీ డ్రైవర్ నిర్లక్ష్యంపై అనుమానం

**చేవెళ్ల, నవంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):**
చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో ఈ ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై కంకరతో లోడైన లారీ ఒక ఆర్టీసీ బస్సును ఎదురుగా ఢీకొట్టడంతో 20 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 40 మందికి పైగా గాయపడ్డారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదం చోటు చేసుకున్న సమయంలో బస్సులో సుమారు 70 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. బస్సు హైదరాబాద్ నుంచి తాండూర్ వైపు బయలుదేరగా, మీర్జాగూడ సమీపంలోని ఖానాపూర్ గేట్ వద్ద ఎదురుగా వచ్చిన లారీ వేగం అదుపు తప్పి బస్సును ఢీకొట్టింది



మిగతా 2లో

## చేవెళ్ల బస్సు ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి



**హైదరాబాద్, నవంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):**
చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం రాష్ట్రాన్ని విషాదంలో ముంచేసింది. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారిపై సీఎం ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాద స్థలంలోని దృశ్యాలు ఎంతో బాధాకరంగా ఉన్నాయని ఆయన తెలిపారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

మిగతా 2లో



## చేవెళ్ల బస్సు ప్రమాదంపై మంత్రి పొన్నం సమీక్ష

### బాధితులను పరామర్శించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**చేవెళ్ల, నవంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):**
రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలో జరిగిన భయానక బస్సు ప్రమాదం రాష్ట్రాన్ని విషాదంలో ముంచెత్తింది. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధితుల కుటుంబాలకు ధైర్యం కలగాలని ఆకాంక్షిస్తూ, ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.
మంత్రి ప్రకటించిన వివరాల ప్రకారం ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం నుండి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఆర్టీసీ నుండి అదనంగా

మిగతా 2లో



## చనాకా–కొరటా ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలి

- రైతుల నష్టానికి ప్రభుత్వం బాధ్యత వహించాలి
- నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కవిత డిమాండ్

**ఆదిలాబాద్, నవంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):**
జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆదిలాబాద్ జిల్లాలోని చనాకా-కొరటా ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించిన ఆమె, ప్రభుత్వ నిర్లక్ష్యంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 50 వేల ఎకరాలకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఈ ప్రాజెక్టు 90 శాతం వరకు పూర్తయినా, గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలిన 10 శాతం పనులను కూడా పూర్తి చేయలేకపోయిందని ఆమె పేర్కొన్నారు.

మిగతా 2లో

## ఎట్టి పరిస్థితుల్లోనూ ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు పూర్తి చేస్తాం

### సీఎం రేవంత్ రెడ్డి దృఢసంకల్పం



**అచ్చంపేట, (తెలంగాణ ముచ్చట్లు):**
శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అచ్చంపేట మండలం మన్నెవారిపల్లిలో నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ శాస్త్రవేత్తల నేతృత్వంలో హెలిబోర్న్ ఏరియల్ ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ సర్వేను హెలికాప్టర్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మీడియాతో సీఎం మాట్లాడారు. రెండు దశాబ్దాలుగా పెండింగులో ఉన్న ఈ ప్రాజెక్టును తిరిగి ముందుకు తీసుకెళ్తున్నామని ఆయన తెలిపారు.

మిగతా 2లో




## సులభంగా డబ్బు వస్తుందంటే జాగ్రత్త!

- వెనుక మోసగాళ్ల ఉచ్చు ఉంటుంది
- తెలంగాణ పోలీస్ హెచ్చరిక

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**
ఇటీవలి కాలంలో "త్వరగా డబ్బు సంపాదించండి", "మినిట్లలో లాభాలు పొందండి", "ఇన్వెస్ట్ చేస్తే రెట్టింపు రాబడులు" అంటూ సోషల్ మీడియాలో విస్తరిస్తున్న ప్రకటనలు,

మిగతా 7లో

## బోరబండలో బీఆర్ఎస్ జోష్

### కేటీఆర్ రోడ్‌షోలో ఉత్సాహం ఉరకలు

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**
జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచార వేడిని మరింతగా రగిలించినది బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన భారీ రోడ్‌షో. వర్షం కురుస్తున్నా, బోరబండ వీధులు జన సందోహంతో కిక్కిరిసిపోయాయి. పార్టీ వాహనాల ఊరేగింపు, జెండాల ఊపు, డప్పుల శబ్దం, "కారు గెలవాలి" అంటూ మార్మోగిన నినాదాలు ఈ ప్రాంతాన్ని పండగ వాతావరణంలో ముంచేశాయి.
ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ, "బోరబండకు బుల్డోజర్లు రావొద్దంటే, రెండు ఏళ్ల అరాచక పాలన పోవాలంటే, నవంబర్ 11న కారు గుర్తుకే ఓటేయాలి" అని ప్రజలకు పిలుపునిచ్చారు.

మిగతా 2లో






## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై కాంగ్రెస్ సమీక్షా సమావేశం

- బూత్ స్థాయి బలపరిచే చర్యలపై చర్చ
- పార్టీ విజయానికి సమన్వయంతో పని చేయాలన్న పిలుపు

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ ఇంచార్జ్‌లు, బూత్ పరిశీలకులతో ఈ సమీక్షా కార్యక్రమం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల వ్యూహాలపై దృష్టి సారించింది.



మిగతా 2లో

## జూబ్లీహిల్స్‌లో బీజేపీ జోష్



### వర్షాన్నీ తట్టుకుని ప్రచార జోరు

**హైదరాబాద్, నవంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):**
జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచార పర్వంలో వర్షాన్ని లెక్క చేయని బీజేపీ కార్యకర్తలు ప్రజల్లో ఉత్సాహాన్ని రగిలిస్తున్నారు. హోరుగా కురుస్తున్న వర్షం మధ్య కూడా పార్టీ జెండాలు, నినాదాలతో వీధుల్లో ఊరేగిన బీజేపీ దళం ప్రజల దృష్టిని ఆకర్షించింది.

మిగతా 2లో

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# చేవెళ్ల సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)



ఢీకొట్టిన తీవ్రతకు బస్సు ముందుభాగం పూర్తిగా ధ్వంసమైపోగా, పలువురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతిచెందారు.

సమాచారం అందుకున్న వెంటనే చేవెళ్ల పోలీసులు, స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగిందనే అనుమానం వ్యక్తమవుతోంది.

ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విషాదం నెలకొంది. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ అధికారులు సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నారు.

## చేవెళ్ల బస్సు ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి

(మొదటి పేజీ తరువాయి)



ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు తగిన పరిహారం అందించేందుకు సంబంధిత మంత్రులు, అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. అలాగే గాయపడిన వారిని మెరుగైన వైద్యం అందించేలా ఆరోగ్య శాఖను అప్రమత్తం చేశారు.

ఆర్టీసీ బస్సులకు సంబంధించిన బీమా పథకాల కింద బాధిత కుటుంబాలకు వీలైనంత త్వరగా సాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు సూచించారు. ప్రమాదాల నివారణకు తగిన భద్రతా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్టీసీ అధికారులకు సీఎం ఆదేశించారు.

## చేవెళ్ల బస్సు ప్రమాదంపై మంత్రి పొన్నం సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

రూ.2 లక్షల సాయం అందజేయబడుతుంది. గాయపడిన వారికి రూ.2 లక్షల చొప్పున నష్టపరిహారం అందించనున్నట్లు తెలిపారు. ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు సంబంధిత అధికారులను ఆదేశించారు.

పొన్నం ప్రభాకర్ చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో బస్సు ప్రమాద బాధితులను స్వయంగా పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. చికిత్సలో ఎలాంటి లోపం లేకుండా నాణ్యమైన వైద్యం అందించాలని వైద్య అధికారులకు సూచించారు.

మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహణ, బాధిత కుటుంబాల సాయం వంటి అంశాలపై ఆర్టీసీ ఎండీ, పోలీస్ కమిషనర్, వైద్యశాఖ అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఘటనపై సమగ్ర నివేదికను వెంటనే సమర్పించాలంటూ ఆదేశించారు.

మంత్రి మాట్లాడుతూ.. "ప్రభుత్వం నిరంతరం ఈ ఘటనపై పర్యవేక్షణ చేస్తోంది. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు నివారించేందుకు కఠిన చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు.





## ఎట్టి పరిస్థితుల్లోనూ ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు పూర్తి చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

మిగిలిపోయిన 9.8 కిలోమీటర్ల టన్నెల్ పనుల కోసం శాస్త్రవేత్తలతో పాటు టన్నెల్ నిర్మాణంలో అనుభవం కలిగిన ఆర్మీ అధికారులను చేర్చుకున్నామని వెల్లడించారు. భూగర్భ పరిస్థితులను ఖచ్చితంగా అంచనా వేయడానికి హెలిబోర్న్ సర్వే దోహదపడుతుందని, ఇది 800 నుండి 1000 మీటర్ల లోతులోని రాయి, నీటి ప్రవాహాల స్థితిని ప్రతీ 2.5 మీటర్లకు ఒకసారి గుర్తించగలదని వివరించారు.

గ్రావిటీ ద్వారా 30 టీఎంసీల నీటిని 3 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మందికి తాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో 1983లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు, పదేళ్ల పాటు నిర్లక్ష్యానికి గురైందని ఆయన గుర్తుచేశారు. 44 కిలోమీటర్ల టన్నెల్‌లో 33 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని, మిగతా పనులను ఆధునిక సాంకేతికతతో పూర్తిచేస్తామని చెప్పారు. విద్యుత్ వినియోగం లేకుండా గ్రావిటీ ద్వారా నీటిని తరలించే ఈ ప్రాజెక్టు దేశంలోనే అత్యుత్తమమని అభివర్ణించారు.

కృష్ణా నదిపై ఉన్న ఇతర ప్రాజెక్టులు బీమా, నెట్టంపాడు, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టులు పూర్తికాకపోవడంతో తెలంగాణ తన నీటి హక్కులను వినియోగించుకోలేకపోయిందని ఆయన విమర్శించారు. "ఇక మేము వెనకడుగు వేయము. ఎన్ని అడ్డంకులొచ్చినా తొలగించుకుంటూ ఎస్ఎల్‌బీసీని పూర్తి చేస్తాం. ఈసారి పూర్తి చేయకపోతే ప్రజలు క్షమించరు" అని సీఎం హెచ్చరించారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పనులు వేగంగా సాగేందుకు మార్లపాడు తాండా, కేశీ తాండా, నక్కలగండి తాండా వాసులకు డిసెంబర్ 31 నాటికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు అందజేస్తామని హామీ ఇచ్చారు. "నిధులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు, గ్రీన్ చానెల్ ద్వారా మంజూరు చేస్తాం. ఈ ప్రాజెక్టు తెలంగాణ గౌరవానికి ప్రతీకగా నిలుస్తుంది" అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## చనాకా–కొరటా ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టు కోసం తవ్విన కాల్వల్లో వరద నీళ్లు ఉప్పొంగి రైతుల పంటలు నష్టపోతున్నాయని ఆమె తెలిపారు. ఇది ప్రభుత్వ నిర్వీర్యతకు నిదర్శనమని కవిత విమర్శించారు.

కొరట గ్రామంలోని నిర్వాసితులు ఇంకా పరిహారం కోసం ఎదురుచూస్తున్నారని, మొత్తం 213 మంది నిర్వాసితులకు తక్షణమే న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. "ప్రాజెక్టు పనులను పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయరాదు" అని కవిత స్పష్టం చేశారు.



## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై కాంగ్రెస్ సమీక్షా సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి కొండా సురేఖ, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, సంపత్‌కుమార్ పాల్గొన్నారు. అదనంగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, చైర్మన్‌లు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఉప ఎన్నికల నిర్వహణ, బూత్ స్థాయి బలపరిచే చర్యలపై తన అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పార్టీ ఈ సమావేశం ద్వారా ఉప ఎన్నికల్లో పార్టీ విజయానికి అవసరమైన వ్యూహరచన, స్థానిక బలహీనతల సవరణ, బూత్ మేనేజ్‌మెంట్ పట్ల నాయకులకు మార్గదర్శకత్వం ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకుంది.

## బోరబండలో బీఆర్ఎస్ జోష్





(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, నిర్లక్ష్యం, అభివృద్ధి నిలిచిపోవడం వంటి అంశాలను ఆయన కఠినంగా విమర్శించారు. ప్రచార ర్యాలీలో పాల్గొన్న ప్రజల ఉత్సాహం కేటీఆర్ మాటలకే సమాధానమైంది. వర్షంలో తడుస్తూ కూడా వేలాదిమంది రోడ్లపై నిలబడి కారు గుర్తుకు జైకారాలు పలికారు. కేటీఆర్ రోడ్‌షోకు స్థానిక మహిళలు, యువత, పార్టీ కార్యకర్తలు భారీగా హాజరై, మాగంటి సునీత అభ్యర్థిత్వానికి మద్దతు ప్రకటించారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ప్రజల స్పందన చెబుతోందని పార్టీ నేతలు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.

"ప్రజల ఆశయాల పునరుద్ధరణ కారు గుర్తు ద్వారానే సాధ్యమవుతుంది" అని కేటీఆర్ పేర్కొన్నారు. ఉపఎన్నిక వాతావరణం హోరాహోరీగా మారుతుండగా, కేటీఆర్ రోడ్‌షోతో బీఆర్ఎస్ శిబిరంలో కొత్త ఉత్సాహం నింపినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## ఆడబిడ్డల చదువులపై కుట్ర చేస్తున్న రేవంత్ ప్రభుత్వం

### కవిత ఆగ్రహం



**హైదరాబాద్, నవంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో ఫీ రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేద, మధ్యతరగతి విద్యార్థులతో పాటు ఆడబిడ్డల ఉన్నత విద్యా అవకాశాలను దూరం చేస్తున్నదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా విమర్శించారు.

"ఫీ రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించకపోవడం వల్ల ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా 2,500 పైగా కాలేజీలు మూతపడ్డాయి. విద్యార్థుల ఇంటర్నల్, సెమిస్టర్ పరీక్షలు నిలిచిపోయాయి. ఇది విద్యార్థుల భవిష్యత్తుపై చేసిన దాడి" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కవిత పేర్కొన్నారు, రూ.10 వేల కోట్లకు పైగా ఫీ రీయింబర్స్మెంట్ బకాయిలు ఉన్నా, ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని అన్నారు. "సెప్టెంబర్ 15లోపు రూ.1,200 కోట్లు విడుదల చేస్తామన్న హామీ నెరవేర్చకుండా కాలేజీలు మూతపడే స్థితికి వచ్చాయి. ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం" అని ఆమె వ్యాఖ్యానించారు.

ఆడబిడ్డలకు ఉన్నత చదువులు అందకుండా చేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ కుట్రగా పేర్కొంటూ, "పేదల చదువుల హక్కు కోసం తెలంగాణ జాగృతి ఉద్యమిస్తుందని, విద్యార్థుల హక్కుల కోసం వీధుల్లోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నాం" అని కవిత హెచ్చరించారు. "ప్రతి విద్యార్థి భవిష్యత్తు కోసం ప్రజలు, విద్యార్థులు కలసి పోరాడాలి. విద్యను రాజకీయాల బలి పీఠం చేయడం ఆపాలి" అని ప్రభుత్వాన్ని సూటిగా ఎద్దేవా చేశారు.

## జూబ్లీహిల్స్‌లో బీజేపీ జోష్

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర మంత్రి శ్రీ కిషన్ రెడ్డి నాయకత్వంలో ప్రచారం కొనసాగుతుండగా, ఆయనను కలుసుకోవడానికి భారీగా తరలి వచ్చిన జనసందోహం బీజేపీ బలాన్ని చాటిచెప్పింది. వర్షం కారణంగా తడిసి ముద్దయినా, ప్రజలు ఉత్సాహంగా హారతులు పట్టి, కిషన్ రెడ్డి గారికి ఘన స్వాగతం పలికారు.

ప్రచార సభల్లో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి ప్రజలకు పార్టీ సంకల్పాలను వివరించారు. స్థానిక సమస్యల పరిష్కారం, అభివృద్ధి ప్రాధాన్యతలపై ప్రజలతో నేరుగా మాట్లాడారు. ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందన బీజేపీ అభ్యర్థి విజయాన్ని సూచిస్తోందని పార్టీ నేతలు నమ్మకంగా చెబుతున్నారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ప్రజల ఉత్సాహం, కార్యకర్తల కృషి, కిషన్ రెడ్డి నాయకత్వం కలిపి బీజేపీ గెలుపుకు బలమైన గాలి వీచుతోందని పార్టీ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేశాయి.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





## జెడ్పీ బాలికల పాఠశాల విద్యార్థినుల గెలుపు జెండా

- రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ముగ్గురు విద్యార్థినుల ఎంపిక.

**సత్తుపల్లి, నవంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు క్రీడా రంగంలో తమ ప్రతిభను మరోసారి నిరూపించారు. ఆదివారం అదే పాఠశాలలో జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్-14 కరాటే ఎంపిక పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబరిచి ముగ్గురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ పోటీల్లో ఎస్. డి. ఆఫ్రిన్, ఎం. పావని, ఎం. ప్రహర్షిక తమ చురుకుదనం, పట్టుదలతో ఆకట్టుకుని పాఠశాల పేరు మరింత ఎత్తుకు చేర్చారు. ఈ విజయం పాఠశాలకు మాత్రమే కాకుండా మొత్తం సత్తుపల్లి ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది. వారి విజయంపై ప్రధానోపాధ్యాయుడు ఎన్. నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయురాలు (పిడి) చీకటి శ్రీదేవి హర్షం వ్యక్తం చేశారు. వీరు రాష్ట్ర స్థాయిలోనూ బాగా ప్రదర్శించి జాతీయ స్థాయికి వెళ్లాలని మా ఆశయం అని చెప్పారు.

ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ, విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దడంలో వ్యాయామ ఉపాధ్యాయుల (పిడి) పాత్ర చాలా ముఖ్యమైనది. వారి శిక్షణ, మార్గదర్శకత, ప్రోత్సాహం వల్లే ఈ విజయాలు సాధ్యమవుతున్నాయి అని అన్నారు.

ఈ విజయంతో అయ్యగారిపేట జెడ్పీ బాలికల పాఠశాల పేరు మళ్లీ వెలుగులోకి వచ్చింది. తల్లిదండ్రులు, విద్యావర్గాలు విద్యార్థినుల విజయంపై ఆనందం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.



## మాజీ మంత్రి హరీష్ రావును పరామర్శించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్, నవంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. హరీష్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మరణించడంతో, హైదరాబాద్‌లోని వారి నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సత్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని, ఇలాంటి కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని భగవంతుని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, మీర్‌పేట్ హౌసింగ్ బోర్డు డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, బీఆర్ఎస్ గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్, భూపాల్ రెడ్డి, బుచ్చయ్య పాల్గొన్నారు.



## దత్త సాయి పేస్-2 కాలనీలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

ముప్పు శ్రీనివాస్ రెడ్డి

**నాగారం, నవంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** నాగారం మున్సిపల్ పరిధిలోని దత్త సాయి పేస్2 కాలనీలో డ్రైనేజీ సదుపాయాల అభివృద్ధి పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. కాలనీలో నీటి నిల్వలు, కాలువలు లేకపోవడం వల్ల వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేయడంతో, వారి అభ్యర్థన మేరకు ఈ పనులకు శంకుస్థాపన జరిగింది.ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొని పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,కాలనీ ప్రజలు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న డ్రైనేజీ సమస్య ఇప్పుడు పరిష్కారం అవుతుందని, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ముఖ్యమని పేర్కొన్నారు. కాలనీలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు.కాలనీ అభివృద్ధి కోసం సమష్టిగా కృషి కొనసాగుతుందని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడం తమ లక్ష్యమని నాయకులు తెలిపారు. భవిష్యత్తులో రహదారులు, వీధిదీపాలు, నీటి సదుపాయాల వంటి పనులూ దశలవారీగా పూర్తి చేయనున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సుధీర్, కేశవరెడ్డి, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

## సూరారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గృహప్రవేశం





- ముఖ్య అతిథిగా మండల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పొన్నం ఇన్అనూప్ గౌడ్

**ఎల్కతుర్తి. నవంబర్03 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మంజూరైన గృహాల్లో గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పొన్నం అనూప్ గౌడ్ హాజరై లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం నిర్వహించారు.

ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారురాలు సింగవేన మానస మాట్లాడుతూ, "ఇందిరమ్మ ఇల్లు రావడం ఎంతో సంతోషంగా ఉంది. నా సొంత ఇంటి కల నెరవేరింది. ఈ సంతోషాన్ని ఇచ్చిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు మరియు గ్రామ నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు" అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజీ, సూరారం గ్రామ శాఖ అధ్యక్షుడు బచ్చు శ్రీధర్ రావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబాల శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా మాజీ జనరల్ సెక్రటరీ మండ సుమన్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్ బచ్చు బాపురావు, దాట్ల ప్రవీణ్, మొలుగురి భాస్కర్, కుర్ర చంద్ర ప్రకాష్, పోలాటి తిరుమల్ రావు, భాష బోయిన సంతోష్, ఉట్కూరి ప్రణీత్ గౌడ్, పెంకచికల్ పేట్, గ్రామ శాఖ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్, జగన్నాధపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు ముష్కె శ్రీనివాస్, శేఖర్ గౌడ్, రఘురాం గౌడ్, రాంభూపాల్ రెడ్డి, చల్లూరి వేణు, ఇరువాల సాంబయ్య, పుల్లింటి సంపత్, గడలా అజయ్ తదితర గ్రామస్థులు పాల్గొన్నారు.

## డాక్టర్లు ఉన్నా.. ఆశా వర్కర్లే వైద్యులు!







**మేడ్చల్/మల్కాజిగిరి,నవంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు ఉన్నా వైద్య సేవలు మాత్రం ఆశా వర్కర్ల చేతుల్లో నడుస్తున్నాయి. జీవనరక్షక బాధ్యతలు నిర్వర్తించే వైద్యులు పక్కకు తప్పుకుని, తగిన శిక్షణ లేని ఆశా వర్కర్లపై బాధ్యతలు నెట్టేసిన దృశ్యాలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.ఇంజక్షన్లు ఇవ్వడం, బ్లడ్ టెస్టులు చేయించడం, ఓపీ రాయడం, ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించడం వంటి పనులను ఆశా వర్కర్లతో చేయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వైద్యాధికారులు వారిని బెదిరించి పనిచేయిస్తున్నారని కూడా మాటలు వినిపిస్తున్నాయి.

ఆశా వర్కర్ల అసలు బాధ్యతలు ప్రజారోగ్య అవగాహన, గర్భిణుల పర్యవేక్షణ, తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణ, టీకా కార్యక్రమాల్లో సహకారం వరకు మాత్రమే పరిమితం. కానీ ఇప్పుడు వారు మందులు రాయడం, రోగులకు ఇంజక్షన్లు ఇవ్వడం వంటి పనులు చేయాల్సి వస్తుండటం తీవ్రమైన ఆందోళనకు దారితీస్తోంది. ఒక స్థానికుడు ఆవేదన వ్యక్తం చేస్తూ..."ప్రభుత్వం ఆశా వర్కర్లను ఆరోగ్య అవగాహన కోసం నియమించింది, కానీ ఇప్పుడు వారినే వైద్యుల్లా వాడుకుంటున్నారు. రోగుల ప్రాణాలు ముప్పులో పడే అవకాశం ఉంది" అని అన్నారు. వైద్య నిపుణులు కూడా ఇదే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "ఆశా వర్కర్లకు వైద్య శిక్షణ లేదు. ఈ విధంగా పనులు అప్పగించడం ప్రమాదకరం. డాక్టర్ల కొరత కారణంగా ప్రాణాలకు ముప్పు రాకుండా చర్యలు తీసుకోవాలి" అని వ్యాఖ్యానిస్తున్నారు. "డాక్టర్ల కొరతను భర్తీ చేయండి. ఆశా వర్కర్లను వారి అసలు సేవలకే పరిమితం చేయండి"అని ప్రజలు కోరుతున్నారు.

## మద్యం దుకాణం వద్దు హెచ్చరించిన సత్యనారాయణ కాలనీ వాసులు





### మద్దతు పలికిన బీజేపీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు

### అక్రమ నిర్మాణంపై "ప్రజావాణి"లో ఫిర్యాదు

**నాగారం, నవంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ జిల్లా కీసర మండలం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీలో నూతన వైన్స్ షాప్ ఏర్పాటు యత్నాలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. పూర్తిగా నివాస ప్రాంతం అయిన ఈ కాలనీలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్నారన్న సమాచారంతో కాలనీ వాసులు సోమవారం ఉదయం భారీ స్థాయిలో ఆందోళనకు దిగారు.

వైన్స్ యజమానులను అడ్డుకున్న స్థానికులు

ఉదయం ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించడానికి వైన్స్ యాజమాన్యం రాగానే, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, మహిళలు, యువత భారీగా చేరుకొని వారిని అడ్డుకున్నారు. "ఇది కుటుంబాలు నివసించే ప్రాంతం... మద్యం దుకాణం వల్ల సామాజిక సమస్యలు పెరుగుతాయి" అని నినాదాలు చేసారు.ఈ నిరసనకు బీజేపీ నాయకులు ఏనుగు సుదర్శన్ రెడ్డి, నాగారం మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్, బీజేపీ టౌన్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, నాయకులు పోతాం శెట్టి వెంకటేశ్వరరావు తదితరులు మద్దతు వ్యక్తం చేశారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

ప్రతిపాదిత స్థలంలో 1600 గజాల విస్తీర్ణంలో షెడ్ నిర్మాణం జరుగుతుండగా, దీనికి అవసరమైన అనుమతులు లేకుండా పనులు చేపడుతున్నారని స్థానికులు ఆరోపించారు. దీనిపై అధికారిక దర్యాప్తు చేసి నిర్మాణాన్ని నిలిపివేయాలని మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్ కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఫిర్యాదు సమర్పించారు.

మహిళల భద్రతపై ఆందోళన

"మహిళలు, బాలికలు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయి. యువతలో వ్యసనాలకు మార్గం సుగమమవుతుంది. ప్రశాంత వాతావరణం దెబ్బతింటుంది" అని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. నివాస ప్రాంతంలో వైన్స్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వొద్దని డిమాండ్ చేశారు.

అధికారులకు వినతి పత్రం

ఆందోళన అనంతరం కాలనీ వాసులు నాగారం మున్సిపల్ కమిషనర్, ఎక్సైజ్ శాఖ అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. వైన్స్ అనుమతి మంజూరైతే భారీ స్థాయిలో ఆందోళనలు, ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

పరిశీలన హామీ

ప్రజల అభ్యర్థనపై అధికారులు స్పందిస్తూ, నియమావళి ప్రకారం వివరాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అయితే డిమాండ్ నెరవేరే వరకు పోరాటం కొనసాగుతుందని కాలనీ ప్రజలు స్పష్టం చేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# భారత మహిళ క్రికెట్ జట్టుకు తొలి వన్డే ప్రపంచ కప్ విజయం

**మాజీ ఎంపీ నామ అభినందనలు**



**ఖమ్మం బ్యూరో, నవంబర్ 3, తెలంగాణ ముచ్చట్లు;** భారత మహిళ క్రికెట్ జట్టు వన్డే ప్రపంచ కప్ తొలి సారిగా గెలిచి భారత క్రీడా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించారని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వర రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భారత మహిళ క్రికెట్ జట్టుకు నామ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మహిళలు క్రీడా రంగంలో చూపుతున్న ప్రతిభ దేశానికి గర్వకారణమని, ఈ విజయం భారత మహిళా శక్తి స్ఫూర్తిని ప్రపంచానికి తెలియజేసిందని ఆయన తెలిపారు. ప్రపంచ కప్ టోర్నీలో వరుసగా మూడు మ్యాచ్ ల్లో ఓడిన మహిళా జట్టు ధైర్యంగా చివరి దాకా పోరాడారని కొనియాడారు. సెమీస్ లో ఆస్ట్రేలియా పైన రికార్డు రన్స్ ఛేదన చేసి వారిని ఓడించటంతో పాటు, ఫైనల్ మ్యాచ్ లో దక్షిణాఫ్రికా పై జట్టు లోని ప్రతీ ఒక్కరు సమిష్టిగా రాణించి ఘన విజయం సాధించినందుకు దేశ ప్రజలంతా గర్వపడుతున్నారన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాగే అంతర్జాతీయ వేదికపై భారత్ జెండాను ఎగురవేయాలని ఆకాంక్షిస్తూ, కోచ్, మేనేజ్‌మెంట్, సపోర్ట్ స్టాఫ్ అందరికీ కూడా ఆయన అభినందనలు తెలిపారు.

# పేద విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు

- ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలి.
- బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు



**ఖమ్మం బ్యూరో, నవంబర్ 03, తెలంగాణ ముచ్చట్లు;** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. సోమవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు ఎనిమిది వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. పేద విద్యార్థుల భవిష్యత్తు నిలిచిపోయే పరిస్థితి వచ్చింది. అయినా ప్రభుత్వం మాత్రం నిశ్చలంగా ఉంది," అని మండిపడ్డారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులకు పూర్తి పారదర్శకంగా నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ హామీని విస్మరించిందని ఆయన విమర్శించారు. "వారు ఇచ్చిన టోకెన్ల ఆధారంగా చెల్లింపులు జరగాల్సింది పోయి, నిధుల లేమి పేరుతో కాలయాపన చేస్తున్నారు. ఇది విద్యా రంగానికి తీవ్రమైన నష్టం," అని పేర్కొన్నారు.

గతంలో విద్యాసంస్థల యాజమాన్యాలు బంద్ చేపట్టి, సంవత్సరం రోజులపాటు పోరాడి ప్రభుత్వాన్ని కదిలించగా, ప్రభుత్వం రూ.1,200 కోట్లు విడుదల చేస్తామని ప్రకటించి మాట తప్పిందని ఆయన గుర్తుచేశారు. "మళ్లీ అదే పరిస్థితి పునరావృతమవుతోంది. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల విద్యాసంస్థలు మళ్లీ బంద్ దిశగా వెళ్తున్నాయి. దీని ఫలితంగా పేద విద్యార్థులు తమ చదువులపై దెబ్బతింటారు," అని కోటేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తు కాపాడుకునే బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన హితవు పలికారు. "ముఖ్యమంత్రి స్వయంగా విద్యాశాఖను తన ఆధీనంలో ఉంచుకున్నప్పటికీ పేద విద్యార్థులకు ఏ మాత్రం భరోసా కల్పించలేకపోతున్నారు. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం ఫీజు చెల్లింపులపై గ్యారంటీ ఇవ్వాలి. విద్యార్థులు విద్యను వదిలేయకుండా చర్యలు తీసుకోవాలి," అని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదల కోసం విజ్ఞప్తి చేస్తే, ప్రభుత్వం విజిలెన్స్ దాడుల పేరుతో బెదిరించడం అత్యంత దుర్మార్గమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇది ప్రజాస్వామ్య విధానాలకు విరుద్ధం. పేదల విద్యను బంధీ చేయడం అన్యాయం. ఈ విధానాలు కొనసాగితే గత ప్రభుత్వానికి పట్టిన గతి, ఈ ప్రభుత్వానికీ తప్పదని ప్రజలు చాటుతారు," అని హెచ్చరించారు. ప్రభుత్వం విద్యాసంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపి, బకాయిలు విడుదల చేసి సమస్యను పరిష్కరించాలని నెల్లూరి కోటేశ్వరరావు స్పష్టం చేశారు.

# చేవెళ్లలో ఘోర రోడ్డు ప్రమాదం పట్ల మాజీ ఎంపీ నామ దిగ్భ్రాంతి



**ఖమ్మం బ్యూరో, నవంబర్ 3, తెలంగాణ ముచ్చట్లు:** చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం పట్ల బిఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ ఢీకొట్టడంతో పలువురు మృతిచెందిన విషయం తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు. బాధితుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అధికారులు సహాయక చర్యలు చేపట్టి, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని నామ కోరారు. ఈ ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు నష్టపరిహారం తక్షణమే అందించాలన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా రోడ్డు భద్రతపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

# మాజీ మంత్రి హరీష్‌రావును పరామర్శించిన శివశంకర్‌రెడ్డి



**హైదరాబాద్,నవంబర్03 (తెలంగాణ ముచ్చట్లు):** మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణరావు ఇటీవల మరణించగా సోమవారం ఆయన చిత్రపటానికి హన్మకొండకు చెందిన ఎస్ఆర్ఆర్ ఇన్‌ఫ్రా అండ్ డెవలపర్స్ అధినేత వెల్గటి శివశంకర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం హరీష్‌రావును పరామర్శించి తన సంతాపాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ కార్పొరేటర్ ఇమ్మడి లోహితరాజు, దళితబంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు లోకిల మహేష్, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ తాటికాయల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 195వ జ్ఞాన మాల కార్యక్రమం





**ప్రధాన అతిథిగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బక్కని నర్సింగ్ రావు**

**కీసర, నవంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** కీసర మండలం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు 195వ వారపు జ్ఞానమాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ బక్కని నర్సింగ్ రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ 195వ జ్ఞానమాలలో పాల్గొనడం ఎంతో గర్వంగా ఉందన్నారు. డాక్టర్ అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం చట్టాల్లో ప్రత్యేక నిబంధనలు చేర్చి ప్రతి పౌరునికి హక్కులు కల్పించారని చెప్పారు. ప్రపంచంలోనే అత్యధిక విగ్రహాలు ఉన్న మహానుభావుడు అంబేద్కరేనని పేర్కొన్నారు.కీసర శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయం పై కీసరగుట్టలో సంక్షేమ భవనం ఏర్పాటుకు ప్రభుత్వ పెద్దలతో చర్చించి సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకొస్తానని హామీ ఇచ్చారు.భారత పార్లమెంటులో సీజెఐపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యం లో తీర్పులు నచ్చకపోతే ప్రజాభి ప్రాయంతో పోరాటం చేయాలని, దాడులు చేయడం అత్యంత దుర్మార్గమని అన్నారు. ఈ కార్యక్రమాల్లో కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోలా కృష్ణయాదవ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బత్తుల వేణుగోపాల్, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు, జర్నలిస్టులు, గ్రామ పెద్దలు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# దరిపల్లి అనంత రాములు ఇంజనీరింగ్ కళాశాలలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్






**ఖమ్మం బ్యూరో, నవంబర్ 3, తెలంగాణ ముచ్చట్లు;** మై భారత్ ఖమ్మం ఆధ్వర్యంలో డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ చింతల ఆదేశాల మేరకు అకౌంట్స్ అండ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కమరతపు భానుచందర్ సహకారంతో శ్రీ సాయి గణేష యూత్ క్లబ్ ప్రెసిడెంట్ కదారి ఉష బ్లాక్ ఫ్లవర్ స్పోర్ట్స్ మీట్ దరిపల్లి అనంత రాములు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో భాగంగా కబడ్డీ, టగ్ ఆఫ్ వార్, షటిల్ మరియు రన్నింగ్ ఆటలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు సర్టిఫికెట్స్ మెడల్స్ షీల్డ్స్ అందించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమమునకు తమ యొక్క సహాయ సహకారాలు అందించినందుకు గాను దరిపల్లి విద్యా సంస్థల అధినేత మరియు ప్రిన్సిపాల్ డా. దరిపల్లి కిరణ్ కి, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చిరంజీవి కి మరియు కళాశాల యాజమాన్యానికి మై భారత్ ఖమ్మం వారు కృతజ్ఞతలు తెలియజేసారు.

# ప్రజలకు అందుబాటులో గోపాల్పూర్ ప్రభుత్వ దవాఖాన సేవలు





- ల్యాబ్ టెక్నీషియన్ బదిలీతో కొంత ఇబ్బంది
- వారానికి రెండు సార్లు పరీక్షల నిర్వహణ
- గోపాల్పూర్ వైద్యాధికారి డాక్టర్ విజేందర్ రెడ్డి

**గోపాల్పూర్,నవంబర్03(తెలంగాణ ముచ్చట్లు):** గోపాల్పూర్ ప్రభుత్వ దవాఖానలో ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు సక్రమంగా అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారి డాక్టర్ విజేందర్ రెడ్డి తెలిపారు.ఆయన మాట్లాడుతూ, "ప్రజలు ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధిక మొత్తాలు ఖర్చు చేయకుండా ప్రభుత్వ దవాఖానలను వినియోగించుకోవాలి. ఇక్కడ అన్ని రకాల చికిత్సలు, సౌకర్యాలు ఉచితంగా లభిస్తున్నాయి" అని పేర్కొన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ బదిలీ కారణంగా కొంత ఇబ్బంది ఏర్పడినప్పటికీ, వారానికి రెండు రోజులు పరీక్షలు నిర్వహించేలా తాత్కాలిక సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. త్వరలోనే శాశ్వత ల్యాబ్ టెక్నీషియన్ నియామకం జరిగే అవకాశం ఉందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ప్రస్తుత వాతావరణ మార్పుల దృష్ట్యా దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం శుభ్రత పాటించి, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు."ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు, మందులు, చికిత్సలు పూర్తిగా ఉచితంగా లభ్యమవుతున్నాయి. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని డాక్టర్ విజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.

# భారత మహిళా జట్టు చరిత్ర సృష్టించింది

**బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు**



**ఖమ్మం బ్యూరో, నవంబర్ 3, తెలంగాణ ముచ్చట్లు:** భారత మహిళా క్రికెట్ జట్టు వన్డే ప్రపంచ కప్‌ను తొలిసారిగా కైవసం చేసుకొని దేశ క్రీడా చరిత్రలో సువర్ణపుటలను రాసిందని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. ఈ అద్భుత విజయంతో భారత త్రివర్ణ పతాకాన్ని అంతర్జాతీయ వేదికపై గర్వంగా ఎగురవేసిన మహిళా యోధాంగనలకు దేశ ప్రజల తరపున హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నానని తెలిపారు. మహిళలు క్రీడా రంగంలో చూపుతున్న అచంచల ప్రతిభ దేశ గౌరవాన్ని మరింత ఎత్తుకు చేర్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ విజయం భారత మహిళా శక్తి సామర్థ్యానికి ప్రతీకగా నిలిచిందని, ప్రపంచానికి స్ఫూర్తినిచ్చే ఘనత సాధించిందని ప్రశంసించారు. టోర్నీలో ప్రారంభ దశలో వరుసగా మూడు పరాజయాలను ఎదుర్కొన్నప్పటికీ, ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ధైర్యంగా పోరాడి చివరికి విజేతలుగా నిలిచిన ఈ జట్టు నిజమైన యోధుల బృందమని కొనియాడారు. సెమీఫైనల్లో ఆస్ట్రేలియాపై రికార్డు స్థాయిలో రన్స్ ఛేదన చేసి వారిని ఓడించడం, ఫైనల్లో దక్షిణాఫ్రికాపై సమిష్టి కృషితో సాధించిన ఘనత చరిత్రలో చిరస్మరణీయమని తెలిపారు. దేశ యువతకు ఈ విజయం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా అంతర్జాతీయ వేదికపై భారత జెండాను మరెన్నో సార్లు ఎగురవేయాలని ఆకాంక్షించారు. ఈ విజయానికి వెనుక ఉన్న కోచ్, మేనేజ్‌మెంట్, సపోర్ట్ స్టాఫ్ అందరికీ కూడా ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా శక్తి క్రీడా రంగంలో సింహస్వప్నాన్ని సాకారం చేసిన ఈ విజయం, దేశవ్యాప్తంగా ప్రతి భారతీయుని గుండెల్లో గర్వాన్ని నింపిందని నెల్లూరి కోటేశ్వరరావు పేర్కొన్నారు.



## లీడర్స్ స్కూల్ లో సాక్షి అక్షర పోటీ పరీక్షలు నిర్వహణ

**వెల్టూర్ లీడర్స్ స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేష్**

**పెద్దమందడి,నవంబర్03(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ లీడర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో సోమవారం 1వ నుండి 7వ తరగతి విద్యార్థుల కోసం సాక్షి అక్షర పోటీ పరీక్షలు ప్రిన్సిపల్ వెంకటేష్ నేతృత్వంలో నిర్వహించబడ్డాయి. ఈ పోటీ పరీక్షలు నాలుగు దశల్లో జరుగుతాయని ప్రిన్సిపాల్ వెంకటేష్ తెలిపారు. సోమవారం మొదటి దశ పరీక్షలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి.

ప్రిన్సిపాల్ వెంకటేష్ మాట్లాడుతూ.. ఈ పోటీ పరీక్షల ప్రధాన లక్ష్యం విద్యార్థుల అక్షర నైపుణ్యాలను పెంపొందించడం, పదజాలాన్ని విస్తరించడం, ఆంగ్ల ఉచ్చారణ నైపుణ్యాలను మెరుగుపరచడం, అలాగే ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే అని వారు చెప్పారు. విద్యార్థులు పోటీ పరీక్షల ద్వారా తమ నైపుణ్యాలను పరీక్షించుకోవడం, నూతన పదాలు నేర్చుకోవడం మరియు సాహసంతో మాట్లాడడం వంటి అంశాల్లో అభ్యసిస్తారని. ఈ పోటీ విద్యార్థుల భవిష్యత్తు కోసం ఒక మంచి అవకాశం అని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, మరియు కరస్పాండెంట్ విష్ణువర్ధన్ సాగర్ పాల్గొన్నారు. విద్యార్థులు మరియు అధ్యాపకులు ఈ పోటీ పరీక్షలను సాకారాత్మకంగా స్వీకరించారు.



## 9న ఉమ్మడి మహబూబ్నగర్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆత్మీయ సభ

**జిల్లా అధ్యక్షులు భరత్, ప్రధాన కార్యదర్శి గుంటి వినోద్ సాగర్**

**వనపర్తి,నవంబర్03(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ సమావేశం వనపర్తి పాలిటెక్నికల్ కాలేజీ ఆవరణలో జిల్లా అధ్యక్షులు భరత్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి వినోద్ సాగర్ అధ్యక్షతన విజయవంతంగా జరిగింది.

సభలో నవంబర్ 9న, ఆదివారం ఉదయం 10 గంటలకు మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆత్మీయ సభ నిర్వహించబడనుందని తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హాజరవుతున్నట్టు తెలిపారు.

సభలో ప్రధానంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కార్పొరేషన్ ఏర్పాటును, సమాన పనికి సమాన వేతనం, అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ రద్దు చేయడం, మరియు ఉద్యోగ భద్రత కల్పించడం వంటి డిమాండ్లపై చర్చలు నిర్వహించబడ్డాయి. జేఏసీ సభ్యులు, ధర్మ, రఘు తదితరులు పాల్గొని, వనపర్తి జిల్లాలోని ప్రతి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఈ సభకు హాజరై ఐక్యతను మరియు బలాన్ని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు.

ప్రతీ ఉద్యోగి పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా నాయకులు కోరారు.

## బీసీలకు 42% రిజర్వేషన్లను రాజ్యాంగ 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

**బిసి, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకుల డిమాండ్**

**పెద్దమందడి,నవంబర్03(తెలంగాణ ముచ్చట్లు):** బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు కల్పించే బిల్లును రాజ్యాంగ 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, అలాగే కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని పెద్దమందడి మండల బీసీ-ఎస్సీ-ఎస్టీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా మండల జేఏసీ నాయకుడు రాయికంటి రాములు యాదవ్ ఆధ్వర్యంలో మండల ఎమ్మార్వో కు వినతిపత్రం సమర్పించారు.

నాయకులు మాట్లాడుతూ.. రాబోయే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, 42% రిజర్వేషన్లలో ఉపవర్గీకరణ (సబ్ క్యాటగరైజేషన్) చేయడం ద్వారా అత్యంత వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం ప్రభుత్వం బీసీ సబ్ ప్లాన్ కింద రూ.40,000 కోట్లు కేటాయించి, బీసీ విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి వినియోగించాలని, హామీలను పూర్తిగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఈశ్వర్ మహారాజ్, రవి యాదవ్, శాంతన్న, ఎలీషా, రాజు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.




# వేలేరు పిహెచ్‌సీలో సమస్యల పర్వం, పట్టించుకోని అధికారులు!

**వేలేరు,నవంబర్03(తెలంగాణ ముచ్చట్లు):**










వేలేరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సీ)లో పలు సమస్యలు నెలకొని ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వైద్యసేవలు అందించే సిబ్బంది సంఖ్య తక్కువగా ఉండడం, పరికరాలు సరిగా పనిచేయక పోవడం, పరిశుభ్రత లోపించడం వలన రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది విధుల వివరాలు బోర్డుపై పొందుపరచకపోవడం, సమాచారం కోసం అడిగినపుడు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం పట్ల ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు లేకపోవడంతో రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, పురుషుల కోసం వేర్వేరు సూచిక బోర్డులు లేకపోవడం కూడా అసౌకర్యానికి కారణమవుతోంది. అదనంగా, వాక్సిన్ నిల్వ ఉంచే రిఫ్రిజిరేటర్ చెడిపోయి మరమ్మతులో ఉందని వైద్య సిబ్బంది తెలిపారు. అయితే రక్త, మూత్ర, కిడ్నీ, లివర్ పరీక్షల కోసం అవసరమైన పరికరాలు, అంబులెన్స్ సౌకర్యం అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.ప్రజలు ఆరోగ్య కేంద్రం పూర్తిస్థాయిలో పనిచేసేలా పరిశుభ్రత, పారదర్శకతతో కూడిన సేవలు అందించేందుకు అధికారుల దృష్టి సారించాలని, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# నవంబర్ 15న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహణ...





**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ రాజగోపాల్**

**ఖమ్మం బ్యూరో, నవంబర్ -3, తెలంగాణ ముచ్చట్లు;** నవంబర్ 15న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు, రాజీ చేసుకోవాలనుకునే వారు దీనిని సద్వినియోగం చేసుకొని కోర్టు కేసుల నుంచి ఉపశమనం పొందాలని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజ గోపాల్ అన్నారు. ఖమ్మం జిల్లా కోర్టులోని న్యాయ సేవ సదన్ లో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహణపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సోమవారం పోలీసు, బ్యాంకర్లు, చిట్ ఫండ్ ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజ గోపాల్ మాట్లాడుతూ లీగల్ సర్వీస్ అథారిటీ తరపున ప్రతి మూడు నెలలకు ఒకసారి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాజీ చేసుకోవాలనుకునే క్రిమినల్, ఇతర కేసులకు లోక్ అదాలత్ ఒక వేదికగా నిలుస్తుందని అన్నారు. యాక్సిడెంట్, భార్యాభర్తల వివాదాలు, చెక్ బౌన్స్ వంటి వివిధ కేసులను లోక్ అదాలత్ లో రాజీ చేసుకోవచ్చని అన్నారు. ప్రమాద కేసులు లోక్ అదాలత్ లో రాజీ చేసుకుంటే ఒకేసారి పరిహారం అందించడం జరుగు తుందని ఆయన తెలిపారు. లోక్ అదాలత్ లో పరిష్కారం చేసుకున్న కేసుల్లో మళ్ళీ ఉన్నత కోర్టులకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉండదని అన్నారు. లోక్ అదాలత్ పట్ల గ్రామీణ ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. నవంబర్ 15న జిల్లాలోని అన్ని కోర్టులలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు దీనిని వినియోగించుకుని కేసులు రాజీ చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మొదటి అదనపు జిల్లా జడ్జి ఉమ, న్యాయమూర్తులు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి. వెంకటేశ్వర రావు, నామినేటెడ్ సభ్యులు న్యాయవాదులు శ్రీనివాసరావు, సంధ్యారాణి, పోలీస్, ఎక్సైజ్, బ్యాంక్ అధికారులు, న్యాయవాదులు, చిట్ ఫండ్, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి

**కార్పొరేటర్ ప్రభుదాస్ పర్యటన**

**కాప్రా, నవంబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** మీర్పేట్ హెచ్‌బి కాలనీ డివిజన్‌లోని అన్నపూర్ణ కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధి పనులను పరిశీలిస్తూ స్థానిక నాయకులతో కలిసి పర్యటించిన స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్. కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి సరఫరా, సీసీ రోడ్డు నిర్మాణాలకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు .ఈ సందర్భంగా కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ, కాలనీలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, పెండింగ్‌లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరియు సీసీ రోడ్డు పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయించేలా కృషి చేస్తామన్నారు. మంచినీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పర్యటనలో నరసింహ గౌడ్, సంజయ్ నాయక్, ప్రేమ్ సాగర్, చంద్రశేఖర్, ప్రసాద్, రాజమల్లు, రాజలింగం తదితర స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



## భారత క్రికెట్ మహిళా జట్టు చరిత్ర రాసింది ఉప్పల్‌లో సంబరాలు

**ఉప్పల్, నవంబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** భారత మహిళా క్రికెట్ జట్టు దక్షిణాఫ్రికాపై ఘనవిజయం సాధించి వరల్డ్ కప్‌ను కైవసం చేసుకున్న సందర్భంగా ఉప్పల్‌లో ఆనందోత్సవాలు నిర్వహించారు. గజ్జెల సత్యరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో అభిమానులు బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా సత్యరాజ్ గౌడ్ మాట్లాడుతూ, “భారత మహిళా క్రికెట్ జట్టు సాధించిన ఈ విజయం 47 ఏళ్ల దేశ ప్రజల చిరకాల స్వప్నానికి నెరవేర్పు. 140 కోట్ల భారతీయుల ఆకాంక్షలను నెరవేర్చిన ఈ విజయం దేశ గర్వాన్ని పెంచింది,” అన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో శాఫాలి వర్మ, దీప్తి శర్మ ఉజ్వల ప్రదర్శనతో జట్టు విజయపథంలో నడిపారని కొనియాడారు.విజయోత్సవాల సందర్భంగా తాళాలు మోగిస్తూ, కేక్ కట్ చేసి, జాతీయ జెండాలు ఊపుతూ ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రఘురాం, వేముల తిరుపతి రెడ్డి, అన్య బాల కృష్ణ, జాజుల నాగేష్ గౌడ్, శ్రీనివాస్ చారి, శ్రీహరి గౌడ్, సాయి, అల్వాల్ నాగరాజు, పొట్లూరి లక్ష్మణ్, వెంకటేష్ పటేల్, శ్రీనివాస్ గౌడ్, మోహన్ రెడ్డి, బిక్షం రెడ్డి, రవీందర్ రెడ్డి, కొనని అంజిరెడ్డి, జగన్, అశోక్, నవీన్, కంకణాల యదగిరి గిరి, జంగారెడ్డి, నాగేష్ గౌడ్, కొత్తగట్టు శ్రీనివాస్ చారి, కృష్ణ, వినోద్, జితేంద్ర, ఉషారాణి, సుభాషిణి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## క్రీడాకారులకు క్రికెట్ కిట్లు,టీషర్టులు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య

**వేలేరు,నవంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలలో భాగంగా స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డా. తాటికొండ రాజయ్య క్రీడాకారులకు క్రికెట్ కిట్లు, టీషర్టులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్నీ పెంపొందిస్తాయని, యువత క్రీడలలో ప్రతిభ చూపి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాలని సూచించారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, పట్టుదల వంటి విలువలు పెంపొందుతాయని ఆయన అన్నారు .ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ మ్యాక రవీందర్, పోలు తిరుపతి, ఎం.డి. జానీ, మారబోయిన రాజు, దేవరాజుల జంపయ్య, కొలిపాక వెంకటేష్ తదితరులు, క్రికెట్ నిర్వహణ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన జీ.ఎం చింతల శ్రీనివాస్

**సత్తుపల్లి, నవంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి సింగరేణి ఏరియాకు కొత్తగా నియమితులైన జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ సోమవారం స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జి.ఎం. శ్రీనివాస్ ఎమ్మెల్యే ని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. తాజాగా ఏర్పాటు చేసిన సత్తుపల్లి సింగరేణి ఏరియాకు తమ సహకారం అందించాలని ఆయన అభ్యర్థించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ, సింగరేణి అభివృద్ధి, స్థానిక ప్రజల సంక్షేమం కోసం తాము ఎల్లప్పుడూ ముందుంటామని హామీ ఇచ్చారు. అదే సమయంలో సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజలకు సంస్థ సహాయ సహకారాలు అందించడంతో పాటు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని ఆమె జి.ఎం. శ్రీనివాస్‌కి సూచించారు.

ఈ కార్యక్రమంలో జే.వి.ఆర్ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రహ్లాద, డి.వై.ఎస్.ఎస్.సి రవికుమార్, సంక్షేమ అధికారి దేవదాసు తదితరులు పాల్గొన్నారు.




## పాఠశాల భవనంలోనే ఆరోగ్య ఉపకేంద్రం

### స్వంత భవనం నిర్మించాలంటూ మల్లికుదుర్ల ప్రజల ఆవేదన

**వేలేరు,నవంబర్03(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రం దయనీయ పరిస్థితుల్లో కొనసాగుతోంది. సోడాషాపల్లి, మల్లికుదుర్ల, గుండ్లసాగర్ గ్రామాలకు ఒకటే ఉపకేంద్రంగా ఉన్నప్పటికీ, ఇప్పటికీ స్వంత భవనం లేకపోవడం ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. తాత్కాలికంగా పాఠశాల భవనంలోనే ఈ కేంద్రం నడుస్తుండటంతో విద్యార్థులు, రోగులు ఇద్దరూ ఇబ్బంది పడుతున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు లేకపోవడంతో రోగులు అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షాకాలంలో నీటిచొరబాటు, దుమ్ము, మురికి వాతావరణం కారణంగా ఆరోగ్య కేంద్రం వద్ద రోగులు చికిత్స పొందడం కష్టంగా మారిందని గ్రామస్తులు తెలిపారు. మల్లికుదుర్ల, సోడాషాపల్లి, గుండ్లసాగర్ గ్రామాల ప్రజలు ఈ ఉపకేంద్రానికి శాశ్వత భవనం నిర్మించి, తగిన సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని, ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు. “మన ఆరోగ్యానికి ఇది ప్రాథమిక అవసరం... ప్రభుత్వం ఇకనైనా మేల్కొనాలి” అని గ్రామస్థులు ఆకాంక్షిస్తున్నారు

# ఆరోగ్యంగా సంతోషంగా జీవించడానికి ఐదు సూత్రాలు





### అవగాహన సదస్సులో డాక్టర్ కె.వి కృష్ణారావు

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 3, తెలంగాణ ముచ్చట్లు;** పుట్టకోట ప్రాథమిక హై స్కూల్ లో న్యూ లక్ష్య ఎన్జీవో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్యంగా , సంతోషంగా జీవించడానికి ఐదు సూత్రాలు అనే అంశంతో నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా పిల్లల డాక్టర్ కె.వి కృష్ణారావు పాల్గొని మాట్లాడారు . ప్రస్తుతం ఉన్న జనరేషన్లో పిల్లలు ఎక్కువగా మొబైల్ ఫోను వాడుతున్నారని అన్నారు . దీనిని తగ్గించడానికి తల్లిదండ్రులు తగు చర్యలు చేపట్టాలని అలాగే ఆహారం అలవాట్లలో మార్పు తీసుకుని రావాలని సమతుల్య ఆహారం కూరగాయలు , పండ్లు తో పాటు సరైన నిద్ర , పరిశుభ్రత , వ్యాయామం , వినోదం అందించాలని సూచించారు . వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరం అని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో న్యూ లక్ష్య ఎన్జీవో ఫౌండేషన్ ఫౌండర్ గరిడేపల్లి సత్యనారాయణ , ఎస్ జ్యోతి హెడ్మిస్ట్రెస్ , సుజాత బయాలజీ టీచర్ , పద్మావతి సైన్స్ టీచర్ , నాగలక్ష్మి ప్రైమరీ స్కూల్ టీచర్ మరియు విద్యార్థులు , స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు .

# తల్లిని కడతేర్చిన.. తనయుడు

### నిందితుడిని అరెస్టు చేసిన ఎస్సై కూచిపూడి జగదీష్.





**ఖమ్మం బ్యూరో , నవంబర్ 3,తెలంగాణ ముచ్చట్లు:** చివరి గడియల్లో తల్లికి అండగా ఉంటాడనుకున్న కొడుకు కాలయముడయ్యాడు.నవమాసాలు మోసిన తల్లిని మద్యానికి బానిసై కన్న పేగే కాటికి చేర్చిన విషాదం తిరుమలాయపాలెం మండలంలో చోటుచేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాకరవాయి గ్రామానికి చెందిన మందుల బూబ (50)అనే మహిళ కొడుకు మధు చేతిలో హతమైంది. బూబ భర్త గతంలోనే చనిపోయాడు.కొడుకు మధుకు వివాహం చేయగా, ఇద్దరు కొడుకులు జన్మించిన తరువాత భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదాల్లో, రెండు సంవత్సరాల క్రితం మధు భార్య ఇద్దరు కొడుకులను తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది. ఈ క్రమంలో మద్యానికి బానిసైన మందుల మధు తన తల్లిని మద్యం కొరకు పెన్షన్ డబ్బులు ఇవ్వమని అడగగా ఆమె నిరాకరించడంతో ఆదివారం రాత్రి గొడ్డలితో కొట్టి హత మార్చడని మృతురాలి తమ్ముడు నల్లగట్టు కాశయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు మందుల మదు పై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి నిందితుడు మందుల మధుని అరెస్టు చేయడమైనదని ఎస్సై కూచిపూడి జగదీష్ తెలిపారు.

# సిపిఎం నాయకులకు మతిభ్రమించింది

- **హత్య రాజకీయాలు చేసేది సిపిఎం**
- **ప్రజల సంక్షేమం కోసం పనిచేసేది కాంగ్రెస్**
- **కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ దుర్గాప్రసాద్**



**ఖమ్మం బ్యూరో, నవంబర్ 3, తెలంగాణ ముచ్చట్లు;** సిపిఎం నాయకులకు మతిభ్రమించి డిప్యూటీ సీఎం పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ దుర్గాప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రం చింతకానిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతర్లపాడు గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు సామినేని రామారావు హత్యను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది అన్నారు. స్పందించిన డిప్యూటీ సీఎం హత్య చేసిన దుండగులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించారన్నారు. హత్య రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ దూరమని, రాష్ట్ర ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ఎజెండా అని తెలియజేశారు. హత్య రాజకీయాలు చేస్తున్నది ఎవరు గోకినపల్లి తెల్దారుపల్లి గ్రామాల్లో జరిగిన ఘటనలే నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ, పథకాలకు ఆకర్షితులైన ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరుతుంటే జీర్ణించుకోలేక సిపిఎం కాంగ్రెస్ పార్టీపై హత్య రాజకీయాల ముద్ర వేయడం ఏమిటని ప్రశ్నించారు. సిపిఎం పార్టీ ఆరోపించినట్లు కాంగ్రెస్ పార్టీ హత్య రాజకీయాలు చేయదని కాంగ్రెస్ పార్టీపై హత్య రాజకీయాలు ఆరోపించిన గ్రామాల్లో భట్టి విక్రమార్కకు బ్రహ్మరథం పట్టి గడచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా గ్రామాల్లో అధిక మెజార్టీ వచ్చింది తెలియజేశారు. పోలీసు యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తుందని పోలీసు ఉన్నతాధికారులు త్వరలోనే హత్య మిస్టరీని ఛేదిస్తారని స్పష్టం చేశారు. సామినేని రామారావును హత్యగావించిన నిందితులు ఎంతటి వారైనా శిక్ష తప్పదని అందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు. సీనియర్ నాయకులు హత్య గావించబడినప్పుడు సమన్వయంతో ఉండాలి కానీ రాజకీయ ప్రాబల్యం కోసం ఇతర పార్టీలపై నిందలు వేయడం ఎంత వరకు సమంజసం అని సిపిఎం పార్టీని ప్రశ్నించారు. అభివృద్ధి ప్రదాత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హత్య రాజకీయాలను సహించడని సుస్పష్టం చేశారు. ఇప్పటికైనా సిపిఎం కాంగ్రెస్ పార్టీపై నిరాదరణమైన ఆరోపణలు, నిందారోపణలు, అసత్య ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అంబటి వెంకటేశ్వరరావు జిల్లా నాయకులు పుచ్చకాయల వీరభద్రం, బొడ్డు బొందయ్య మండల నాయకులు కొప్పుల గోవిందరావు కన్యబోయిన గోపి, కూరపాటి కిషోర్, బందెల నాగార్జున, చట్టు వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ మీడియా ఇంచార్జ్ ఓర్సు వీరభద్రం, ఎస్.కె అబ్దుల్ మజీద్ పాషా, ఎస్కె కాసిం, దేశబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లి పుకట్ నగర్‌లో సిసి రోడ్డు పనుల పరిశీలన



### నేమూరి మహేష్ గౌడ్

**చర్లపల్లి, నవంబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు చర్లపల్లి డివిజన్ పరిధిలోని పుకట్ నగర్‌లో జరుగుతున్న సిసి రోడ్డు పనులను బిఆర్ఎస్ పార్టీ నాయకుడు నేమూరి మహేష్ గౌడ్ శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్లపల్లి డివిజన్ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్ని విధాలా కృషి చేస్తున్నారు. ప్రజలకు మెరుగైన రోడ్లు, కాలువలతో పాటు మౌలిక వసతుల అభివృద్ధిని ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతున్నారు అని తెలిపారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గాలమ్మ, యాదయ్య, బస్వయ్య, ఆనంద్ రాజు, గణేష్, నర్సింహా, రమేశ్, రాజు, బాల్‌రాజు, కోటేశ్, రవి, అనిల్ కుమార్, రెడ్డి నాయక్, వినయ్, శేఖర్, రామ్, సురేష్, శ్రీనివాస్ నాయక్, లోకనాథ్, రాజశేఖర్, మధు, రఘు, హరీష్, నాగరాజు, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

**అభినందనలు..**

**భారత మహిళా క్రికెట్ విశ్వవిజేతలకు!**

అమ్మాయిల ప్రపంచ క్రికెట్ లో
విజయ కిరీటం అందుకొని విశ్వవిజేతలుగా నిలిచిన
మీకు వందనం... అభివందనం.
ఓర్పు, నేర్పు, పట్టుదలతో
క్రికెట్ యుద్ధరంగంలో విజయం సాధించిన
మీ ప్రతిభకు వందనం... అభివందనం.
మైదానంలో అద్భుత బ్యాటింగ్, బౌలింగ్ విన్యాసాలతో
దేశ గౌరవాన్ని ప్రపంచ నలుమూలల చాటిన మీకు
అభినందన మందార, చందన మాలలు.
విజయోస్తు! మహిళా భారత క్రికెట్ సభ్యులకు
జయహో! భరతమాత ముద్దు బిడ్డలకు..
మహిళలు అబలలు కాదు, సబలలు అని నిరూపించి
త్రివర్ణ పతాకం సగర్వంగా ఎగిరేలా చేసిన
మహిళా భారత క్రికెట్ బృందానికి హృదయపూర్వక
అభినందనలు.



– మంజుల పత్తిపాటి
మాజీ డైరెక్టర్,
ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ
యాదాద్రి భువనగిరి జిల్లా,
తెలంగాణ రాష్ట్రం
9347042218

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక


# ప్రాణాంతకం అవుతున్న ప్రయాణం

- బస్సు ప్రమాదాలకు నియంత్రణ ఎక్కడ తప్పుతుంది
- పెరుగుతున్న బస్సు ప్రమాదాలు
- రహదారులపై ప్రాణాల పందెం!



**హైదరాబాద్, నవంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** ఇటీవల బస్సు ప్రమాదాలు వరుసగా జరుగుతుండటం ప్రజల్లో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. రాష్ట్రాల్లోని జాతీయ రహదారులు, పట్టణ ప్రాంతాలు, పల్లె రోడ్లపై దాదాపు ప్రతి వారం ఏదో ఒక ఘోర ప్రమాదం జరుగుతోంది. చేవెళ్లలో ఇటీవల జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదం 20 ప్రాణాలను బలి తీసుకున్నది. అంతకు ముందు కర్నూలు, అనంతపురం, నిజామాబాద్, నల్గొండ జిల్లాల్లో కూడా ఇలాంటి ఘటనలు సంభవించాయి. ప్రజా రవాణా వ్యవస్థలో భద్రతపై గంభీరమైన చర్చ జరగాల్సిన సమయం ఆసన్నమైంది.

ప్రమాదాల వెనుక అనేక కారణాలు దాగి ఉన్నాయి. అధిక వేగం, డ్రైవర్ అలసట, వాహనాల రక్షణలో నిర్లక్ష్యం, రోడ్ల దుస్థితి — ఇవన్నీ కలిపి ప్రాణాంతక ఫలితాలు ఇస్తున్నాయి. చాలా బస్సులు సాంకేతికంగా పాతబడి, రోడ్డుపై నడవకూడని స్థితిలో ఉన్నప్పటికీ ప్రయాణాలు కొనసాగుతున్నాయి. ప్రయాణికుల సంఖ్యను మించి టికెట్లు ఇస్తూ, రాత్రి వేళల్లో అతి వేగంగా నడిపే ఘటనలు కూడా తరచూ బయట పడుతున్నాయి.

ప్రభుత్వం, రవాణా సంస్థలు ప్రతిసారి విచారణలు చేస్తామని, చర్యలు తీసుకుంటామని ప్రకటిస్తున్నప్పటికీ, ఫలితాలు మాత్రం కనిపించడం లేదు. డ్రైవర్లకు తగిన విశ్రాంతి లేకపోవడం, షెడ్యూల్లలో ఒత్తిడి, బస్సు ఫిట్‌నెస్‌పై పర్యవేక్షణ లోపం వంటివి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలు కూడా తగిన స్థాయిలో లేవన్నది వాస్తవం. సామాన్య ప్రజలకు రవాణా భద్రతా చర్యలపై అవగాహన పెంపొందించడం అత్యంత కీలకం. బస్సు ఎక్కే ముందు వాహనం స్థితి, డ్రైవర్ ప్రవర్తన వంటి అంశాలు గమనించడం అవసరం. అదే సమయంలో, ప్రభుత్వం ప్రతి రవాణా శాఖలో క్రమపద్ధతిగా ఫిట్‌నెస్ తనిఖీలు చేయడం తప్పనిసరిగా మార్చాలి. రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు, సిగ్నలింగ్ వ్యవస్థలు, సీసీటీవీ పర్యవేక్షణ పెంచితే అనేక ప్రాణాలు రక్షించవచ్చు.

ప్రతి ప్రమాదం వెనుక ఉన్న బాధ ఒక కుటుంబం నాశనం అవుతోంది. కాబట్టి "అతి వేగం జీవన వేగం కాదు" అనే అవగాహన ప్రతి ఒక్కరిలో ఏర్పడాలి. రవాణా సంస్థలు, అధికారులు, ప్రజలు — ముగ్గురూ కలిసి కట్టుగా వ్యవహరించినప్పుడే రహదారులు సురక్షితంగా మారతాయి. లేకపోతే ఈ దారుణాలు కొనసాగుతూనే ఉంటాయి.





# దేశ గర్వం - మేజర్ సోమనాథ్ శర్మ వీరగాథ





భారత రక్షణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన పేరు మేజర్ సోమనాథ్ శర్మ. ఆయన పేరు చెప్పగానే ప్రతి భారతీయుని మనసులో గౌరవం, దేశభక్తి కలగలసి వెలిసిపోతాయి. దేశ సార్వభౌమత్వం కోసం తన ప్రాణాలను అర్పించిన తొలి వీరుడిగా ఆయన పేరు పరమ్ వీర్ చక్ర చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయింది. 1947లో కాశ్మీర్‌లో జరిగిన మొదటి ఇండోపాక్ యుద్ధంలో ఆయన ప్రదర్శించిన ధైర్యం నేటికీ సైనిక చరిత్రలో బంగారు అక్షరాలతో చెక్కబడి ఉంది.

మేజర్ సోమనాథ్ శర్మ 1923 జనవరి 31న హిమాచల్ ప్రదేశ్‌లోని దడోనాలో జన్మించారు. ఆయన తండ్రి అమర్నాథ్ శర్మ ఇండియన్ ఆర్మీకి చెందిన మెజర్ జనరల్ హోదాలో ఉన్నారు. చిన్నతనం నుంచే సోమనాథ్‌లో దేశసేవ పట్ల ఆసక్తి కలిగింది. సైనిక కుటుంబంలో పెరిగినందున ఆయనకు శౌర్యం, క్రమశిక్షణ, దేశాభిమానం సహజ గుణాలుగా మారాయి. నేషనల్ డిఫెన్స్ అకాడమీ లో శిక్షణ పూర్తిచేసిన తర్వాత కుమావు రెజిమెంట్‌లో చేరారు. యుద్ధానికి ముందు జరిగిన అఘోరమైన కాశ్మీర్ సంక్షోభంలో ఆయన పాత్ర అసాధారణమైనది.

1947 అక్టోబరులో పాకిస్తాన్ నుంచి టెర్రర్ దాడులు ప్రారంభమయ్యాయి. కాశ్మీర్‌ను తమ కబ్జాలోకి తీసుకోవాలన్న ప్రయత్నంలో శత్రువులు గిరిజన మిలీషియా పేరుతో సైన్యాన్ని పంపారు. ఈ పరిస్థితుల్లో భారత సైన్యం తక్షణమే స్పందించగా, ఆ ఆపరేషన్‌లో ముందుండి పోరాడింది మేజర్ సోమనాథ్ శర్మ ఆధ్వర్యంలోని 4వ కుమావు బెటాలియన్. నవంబర్ 3న బద్గామ్ ప్రాంతంలో ఆయన బెటాలియన్‌పై శత్రువులు విపరీతంగా దాడి చేశారు. సంఖ్యలో ఎక్కువగా ఉన్నా, ఆయుధ శక్తిలో తక్కువగా ఉన్నా, సోమనాథ్ శర్మ వెనుకడుగు వేయలేదు. ఆయన ధైర్యం, నాయకత్వం సైనికులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించింది.

యుద్ధం తీవ్రస్థాయికి చేరుకున్న సమయంలో ఆయన ఒక మోర్టార్ బాంబు దెబ్బతో గాయపడ్డారు. చేతులు నశించినా, తాను యుద్ధ భూమి విడిచి వెళ్లకూడదని నిర్ణయించుకున్నారు. తన రేడియో ద్వారా ఆఖరి సందేశం పంపించారు "శత్రువు మన ముందే ఉంది, నా సైనికులు వీరోచితంగా పోరాడుతున్నారు. మనం చివరి వరకు యుద్ధం చేస్తాం. నా ప్రాణం పోయినా, భారతదేశం గెలుస్తుంది." అదే ఆయన చివరి మాట. కొద్దిసేపటికే ఆయన యుద్ధభూమిలో వీర మరణం పొందారు. కానీ ఆయన ధైర్యంతో శత్రు సైన్యం వెనక్కి తగ్గి, కాశ్మీర్ భారత ఆధీనంలో కొనసాగింది. ఆ పోరాటం భారతదేశ భౌగోళిక ఏకతను కాపాడిన చారిత్రక మలుపుగా నిలిచింది.

మేజర్ సోమనాథ్ శర్మ మరణానంతరం దేశం ఆయనకు అత్యున్నత గౌరవంగా



పరమ్ వీర్ చక్ర ప్రదానం చేసింది. ఇది భారత రక్షణ చరిత్రలో మొదటి పరమ్ వీర్ చక్ర అవార్డు. ఆయన కుటుంబం త్యాగానికి ప్రతీకగా నిలిచింది. ఆయన చెల్లెలు, సోదరులు కూడా తరువాత భారత సైన్యంలో కీలక పదవులు చేపట్టడం గమనార్హం.

సోమనాథ్ శర్మ వీరగాథ మనకు చెబుతోంది — దేశభక్తి అనేది మాటలలో కాదు, కర్తవ్య నిబద్ధతలో ఉంటుందని. శత్రువు చేతిలో మృతిని చూసి భయపడకుండా, ధర్మం కోసం త్యాగం చేయడం మన జాతి స్ఫూర్తికి సాక్ష్యం. ఈ తరం యువత మేజర్ శర్మ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి. ఆయనలాంటి సైనికుల వల్లే నేడు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నాం.

భారత సైనికుడి యూనిఫాం కేవలం గౌరవానికి ప్రతీక కాదు, అది త్యాగం, ధైర్యం, దేశసేవకు ప్రతిజ్ఞ. మేజర్ సోమనాథ్ శర్మ ఈ సత్యాన్ని తన రక్తంతో రాసి చూపించారు. ప్రతి నవంబర్ 3న దేశం ఆయనను స్మరించుకుంటుంది, కానీ ఆయన స్ఫూర్తి మాత్రం ప్రతీరోజూ మన హృదయాల్లో నిలిచిపోవాలి. "దేశం కోసం ప్రాణం ఇచ్చిన వారు అమరులు; వారి త్యాగమే మన స్వేచ్ఛకు మూలం."

మేజర్ సోమనాథ్ శర్మ పేరు ఆ అమరులలో అగ్రగామి. ఆయనను స్మరించడం అంటే దేశభక్తిని గౌరవించడం.

# సులభంగా డబ్బు వస్తుందంటే జాగ్రత్త!

(మొదటి పేజీ తరువాయి)




సందేశాలు ప్రజల జేబులను ఖాళీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలను మరోసారి అప్రమత్తం చేస్తూ తెలంగాణ పోలీసులు కీలక సూచనలు చేశారు.

వారి హెచ్చరికలో పేర్కొన్నట్టుగా, తెలియని వ్యక్తులు లేదా వెబ్‌సైట్లు "సులభంగా డబ్బు వస్తుంది" అంటూ ఇచ్చే హామీలను నమ్మొద్దని, ఇవి చాలా వరకు ఆన్‌లైన్ మోసాలకు సంబంధించినవని ప్రజలకు తెలిపారు. ముఖ్యంగా టెలిగ్రామ్, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి మాధ్యమాల ద్వారా షేర్ అవుతున్న "ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్" లింకులు, యాప్స్ వెనుక నకిలీ ఖాతాలు, ఫేక్ కంపెనీలు ఉన్నాయని పోలీసులు గుర్తించారు.

ఈ మోసగాళ్లు మొదట చిన్న మొత్తాలను రాబడిగా చూపించి విశ్వాసం పొందుతారు. ఆ తరువాత పెద్ద మొత్తాల పెట్టుబడులు వేయమని ఒత్తిడి చేస్తారు. చివరికి ఆన్‌లైన్ ఖాతాలు మూసి పెట్టి అదృశ్యమవుతారు. ఈ విధంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే వందలాది మంది సైబర్ మోసాలకు బలయ్యారని పోలీసులు వెల్లడించారు.

"ఏదైనా ఆఫర్ చాలా ఆకర్షణీయంగా, తక్షణ లాభాల వాగ్దానం చేస్తే, అది మోసం అయ్యే అవకాశం ఎక్కువ" అని పోలీసులు హెచ్చరించారు. ఎవరూ తమ బ్యాంక్ వివరాలు, ఓటీపీలు, వ్యక్తిగత సమాచారం తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా "సులభంగా డబ్బు వస్తుంది" అని చెప్పే లింకులు, వెబ్‌సైట్లు లేదా మొబైల్ యాప్‌లలో నమోదు కాకూడదని సూచించారు.

పోలీసులు ప్రజలకు జాగ్రత్త సూచిస్తూ "తెలియని వారిచే పంపిన లింకులు, మెసేజ్‌లు ఓపెన్ చేయకండి. అనుమానాస్పద స్కీమ్‌ల గురించి వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా సైబర్ హెల్ప్‌లైన్ 1930కు సమాచారం ఇవ్వండి. అజాగ్రత్తగా వ్యవహరించడం వల్ల మోసగాళ్ల ఉచ్చులో పడే ప్రమాదం ఉంటుంది" అని హెచ్చరించారు. సాంకేతిక ప్రగతితోపాటు సైబర్ నేరాల సంఖ్య పెరుగుతోందని, ప్రజల అవగాహన మాత్రమే రక్షణ మార్గమని పోలీసులు తెలిపారు. సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ పోలీస్ ఈ హెచ్చరిక జారీ చేసింది.

# రైతులను వదిలేసి షికార్లు చేస్తున్న రేవంత్ ప్రభుత్వం

**బీజేపీ విమర్శలు..**

**నిర్మల్, నవంబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** మొంథా తుఫాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్న మూడు లక్షల మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో, ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని బీజేపీ శాసనసభాపక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకునే బదులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాధనంతో షికార్లు, పర్యటనల్లో తలమునకలై ఉన్నారని ఆయన విమర్శించారు.

రైతులు తమ పంటలను కోల్పోయి ఆర్థికంగా కుంగిపోతున్న సమయంలో, వారికి ఊరట కలిగించాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసిందని మహేశ్ రెడ్డి అన్నారు. "ప్రభుత్వం మాటలకే పరిమితమైపోతోంది. నేలపై ఒక్క రూపాయి సాయం కూడా రైతులకు చేరడం లేదు. ఇది ప్రజాస్వామ్యానికి అవమానం, రైతులపై అన్యాయం," అని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మొంథా తుఫాను కారణంగా పంటలు దెబ్బతిన్న ప్రతి రైతుకూ కనీసం రూ.30,000 పరిహారం తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. "ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు గాలిలో కలిసిపోయాయి. బకాయిలు విడుదల చేయకపోవడంతో రైతులు అప్పుల బారిన పడుతున్నారు. రుణమాఫీ, పంట బీమా, నష్టపరిహారం — అన్నీ కాగితాలకే పరిమితం అయ్యాయి," అని బీజేపీ నేత తీవ్రంగా విమర్శించారు.

రైతు కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోతున్న నేపథ్యంలో, ప్రభుత్వం పంట నష్టాల అంచనాలు వేగంగా పూర్తి చేసి, నష్టపోయిన రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నష్ట పరిహారం జమ చేయాలని సూచించారు. "రైతు సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం పెద్ద పెద్ద హామీలు ఇచ్చినా, వాటిని అమలు చేసే ఉద్దేశం కనిపించడం లేదు. ఇది రైతుల విశ్వాసానికి చేసిన ద్రోహం," అని ఆయన అన్నారు. "ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ భారీ ఉద్యమాలు చేపడుతుంది. రైతుల కోసం, వారి హక్కుల కోసం మేము ఏ స్థాయికైనా వెళ్తాం" అని మహేశ్ రెడ్డి స్పష్టం చేశారు.







# భారత క్రీడల్లో మహిళల ఎదుగుదల



భారతీయ మహిళలు ఇకపై వంటింటికే పరిమితం కాలేదని, ప్రపంచ వేదికలపై తామెంత శక్తివంతంగా నిలబడగలమో నిరూపిస్తున్నారు. ఒకప్పుడు క్రీడలలో మహిళలకు అవకాశాలు తక్కువగా ఉన్నా, నేడు వారి ప్రతిభ అంతర్జాతీయ స్థాయిలో మెరిసిపోతోంది.

పీవీ సింధు, మేరీ కోమ్, సానియా మిర్జా, సాక్షీ మాలిక్, మిథాలీ రాజ్, స్మృతి మంధాన వంటి పేర్లు నేడు ప్రతి భారతీయునికి గర్వకారణమయ్యాయి. వీరంతా తమ కృషితో మాత్రమే కాదు, పట్టుదలతో, ధైర్యంతో, సంకల్పంతో క్రీడా రంగంలో కొత్త చరిత్ర రాశారు. ఒకప్పుడు మహిళలకు క్రీడా రంగంలో సౌకర్యాలు లేని పరిస్థితి ఉండగా, ఇప్పుడు మహిళా క్రీడాకారిణుల కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రాలు, ప్రోత్సాహక పథకాలు అందుబాటులోకి వచ్చాయి. భారత క్రీడా చరిత్రలో మేరీ కోమ్ ఆరుసార్లు ప్రపంచ చాంపియన్ కావడం, పీవీ సింధు ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలవడం, మిథాలీ రాజ్ భారత మహిళా క్రికెట్ జట్టును అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడం వంటి విజయాలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. ఈ విజయాలు తర్వాతి తరాలకు దారినీ చూపాయి. గ్రామీణ ప్రాంతాల నుండి కూడా అనేక యువతులు క్రీడల్లో అడుగుపెడుతూ, దేశానికి కీర్తి తెస్తున్నారు.

ప్రభుత్వం కూడా "ఖేలో ఇండియా", "టార్గెట్ ఒలింపిక్ పాడియం" వంటి పథకాల ద్వారా మహిళా క్రీడాకారిణులకు అవసరమైన మద్దతు అందిస్తోంది. అయితే ఇంకా పలు ప్రాంతాల్లో ఆర్థిక ఇబ్బందులు, సామాజిక పరిమితులు మహిళలను వెనక్కి లాగుతున్నాయి. ఈ అడ్డంకులు తొలగితే భారత మహిళలు ప్రపంచ క్రీడా రంగాన్ని శాసించే స్థాయికి చేరతారు.

క్రీడలు మహిళలకు కేవలం గెలుపు మాత్రమే కాకుండా, స్వాభిమానానికి ప్రతీక. ఈ దిశగా మన సమాజం, కుటుంబాలు మహిళలకు మరింత మద్దతు ఇస్తే, "భారతీయ మహిళ" అనే పేరు ప్రపంచ క్రీడా రంగంలో మరింత ప్రతిష్ఠాత్మకంగా మారడం ఖాయం.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# చేవెళ్ల బస్సు ప్రమాదంపై ప్రధాని మోదీ సంతాపం

**మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం ప్రకటింపు**



తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో జరిగిన ప్రాణ నష్టం తనను తీవ్రంగా కలచివేసిందని ఆయన తెలిపారు.

ఈ క్లిష్ట సమయంలో బాధితులు, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని ప్రధాని పేర్కొన్నారు.

ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు.

ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల సహాయం అందించేందుకు కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు.



# భార్య, ప్రియురాలి హత్య

గుజరాత్‌లో జరిగిన ఈ ఘోర ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఒక వ్యక్తి తన భార్యతో పాటు ప్రియురాలిని దారుణంగా హత్య చేసి, వారి మృతదేహాలను ఒకేచోట పడేశాడు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి.

వివరాల్లోకి వెళ్తే — అక్టోబర్ 29న నవ్‌సారి జాతీయ రహదారి సమీపంలోని ఓ నిర్జన రైస్ మిల్లులో రక్తంతో తడిసి నగ్నంగా ఉన్న ఒక మహిళ మృతదేహం కనిపించింది. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపించారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించిన పోలీసులు నిందితుడిగా ఫైసల్ పఠాన్‌ను గుర్తించారు.

పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అతడు ఆశ్చర్యకరమైన నిజాలను ఒప్పుకున్నాడు. ఏడాది క్రితం రియా అనే యువతితో పరిచయం ఏర్పడిందని తెలిపాడు. ఆ తర్వాత నిర్జన మిల్లులో తరచుగా ఇద్దరూ కలుసుకునేవారని చెప్పాడు. అక్టోబర్ 28న రియా అక్కడకు వచ్చినప్పుడు డబ్బుల విషయంలో వారిద్దరి మధ్య గొడవ జరిగిందని, కోపంతో ఆమెను హత్య చేసి మృతదేహాన్ని అక్కడే పడేశానని వివరించాడు.

ఇదంతా చెబుతూనే మరో పెద్ద నిజాన్ని బయటపెట్టాడు. మూడు నెలల కిందట తన భార్య సుహానాను కూడా హత్య చేసినట్లు అంగీకరించాడు. కుటుంబం తన ప్రియురాలితో ఉన్న సంబంధాన్ని అంగీకరించకపోవడంతో సుహానాతో విభేదాలు ఏర్పడ్డాయని తెలిపాడు. చివరికి జూలైలో సుహానాను మిల్లు వద్దకు పిలిచి అక్కడే చంపి, మృతదేహాన్ని వదిలేశానని పోలీసులకు వెల్లడించాడు.

ఈ వివరాలు తెలిసిన పోలీసులు ఆ మిల్లుకు వెళ్లి పరిశీలించగా, అక్కడ ఒక అస్థిపంజరం కనిపించింది. దాన్ని స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ పరీక్షల కోసం పంపించారు. ఫైసల్ పఠాన్‌పై భార్య, ప్రియురాలిని హత్య చేసిన రెండు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఒకే చోట ఇద్దరి మృతదేహాలను పడేసిన ఈ ఘటన గుజరాత్‌లో తీవ్ర కలకలం రేపింది. దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు, ఫైసల్ పఠాన్ నేరానికి గల పూర్తి కారణాలను తెలుసుకునేందుకు విచారణ కొనసాగిస్తున్నారు.

# కర్ణాటక సీఎం మార్పు చర్చలపై సిద్ధరామయ్య అసహనం

**"మీడియా అవసరానికి మించి ఆసక్తి చూపుతోంది"**



**బెంగళూరు, నవంబర్ 3**

కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశంపై మీడియా తరచూ ప్రశ్నలు లేవనెత్తడం సీఎం సిద్ధరామయ్యకు చిరాకు తెప్పించింది. "ముఖ్యమంత్రి మార్పు గురించి పార్టీ అధిష్ఠానం మీకు చెప్పిందా?" అని జర్నలిస్టులు అడగగా, ఆయన ఆగ్రహంతో స్పందించారు. ఇలాంటి అంశాలపై కొందరు ఎప్పుడూ ఏదో చెబుతుంటారని, ఆ మాటలను పట్టించుకోవద్దని స్పష్టం చేశారు. ప్రజల కంటే మీడియా ఎక్కువ ఆసక్తి చూపుతోందని విమర్శించిన ఆయన, "ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ వంటి నాయకులు ఏదైనా అధికారికంగా చెప్పినప్పుడే నేను మాట్లాడతాను" అని స్పష్టంచేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై పార్టీ అధిష్ఠానంతో చర్చిస్తామని తెలిపారు.

ఇదే సమయంలో పార్టీ వర్గాల ప్రకారం నవంబర్ 11న డిప్యూటీ సీఎం డీ.కె. శివకుమార్ ఢిల్లీకి వెళ్లనుండగా, 15న సిద్ధరామయ్య కూడా కాంగ్రెస్ కేంద్ర నాయకత్వాన్ని కలవనున్నట్లు సమాచారం. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో సీఎం మార్పు ఊహాగానాలు మరింత ఊపందుకున్నాయి.

# ఢిల్లీ కాలుష్యంపై సుప్రీం హెచ్చరిక

**న్యూఢిల్లీ**



ఢిల్లీ-నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో వాయు కాలుష్యం తీవ్రరూపం దాలుస్తున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ సందర్భంగా ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ ను కఠినంగా ప్రశ్నిస్తూ, ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై అఫిడవిట్ సమర్పించాలని ఆదేశించింది.

"పరిస్థితి దిగజారిన తర్వాత స్పందించడం కాదు, ముందుగానే సిద్ధం కావాలి" అని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కే. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. వాయు కాలుష్య నియంత్రణలో నిర్వాహక వ్యవస్థ ముందస్తు ప్రణాళిక లేకుండా పనిచేస్తోందని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది.

విచారణలో అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ న్యాయవాది అపరాజిత సింగ్ తెలిపారు — దీపావళి అనంతరం ఢిల్లీలోని వాయు నాణ్యత పర్యవేక్షణ కేంద్రాల్లో చాలా వాటి కార్యకలాపాలు నిలిచిపోయాయని. మొత్తం 37 మానిటరింగ్ కేంద్రాల్లో కేవలం 9 మాత్రమే నిరంతరాయంగా పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ కేంద్రాలు సక్రమంగా పనిచేయకపోతే, గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ అమలు సమయాన్ని నిర్ణయించడం అసాధ్యమవుతుందని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో, ఇప్పటికే చేపట్టిన చర్యలు, ప్రతిపాదిత ప్రణాళికలపై వివరాలతో కూడిన నివేదికను వెంటనే సమర్పించాలని కోర్టు ను ఆదేశించింది. కాలుష్యం నియంత్రణ ఏజెన్సీలు "ప్రతిస్పందనాత్మకంగా కాకుండా, ముందస్తు చర్యలు తీసుకునే విధంగా" పని చేయాలని స్పష్టం చేసింది.

కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు తరఫున న్యాయవాదులు, గాలి నాణ్యత డేటా సేకరణ బాధ్యత తమదేనని వివరించారు. అన్ని సంబంధిత ఏజెన్సీలు త్వరలో నివేదికలు సమర్పిస్తాయని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కోర్టుకు హామీ ఇచ్చారు.

కోర్టు గతంలో కూడా స్పష్టంగా పేర్కొన్నదే - "కాలుష్యం పెరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కాదు, దానిని అడ్డుకోవడం కోసం ముందస్తు ఏర్పాట్లు అవసరం."

గత నెల దీపావళి సందర్భంగా ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో పరిమిత స్థాయిలో గ్రీన్ క్రాకర్స్ వినియోగానికి కోర్టు అనుమతి ఇచ్చింది. పర్యావరణ పరిరక్షణ, సాంప్రదాయ ఉత్సవాల మధ్య సమతుల్యత అవసరమని సుప్రీంకోర్టు గుర్తు చేసింది.

గ్రీన్ క్రాకర్స్ విక్రయాలు అక్టోబర్ 18 నుంచి 20 మధ్య మాత్రమే జరగాలనీ, నిర్ణీత సమయాల్లోనే వాటిని కాల్చేందుకు అనుమతి ఉందని కోర్టు స్పష్టం చేసింది. ఈ సడలింపును టెస్ట్ కేస్ ప్రాతిపదికన ఇస్తున్నామని కూడా పేర్కొంది.

అదే సమయంలో, అక్టోబర్ 14 నుంచి 25 వరకు గాలి నాణ్యతను క్రమం తప్పకుండా పర్యవేక్షించి, రోజువారీ నివేదికలను కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డులు సమర్పించాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో, ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యంపై ప్రభుత్వ యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టే అవకాశం ఉందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి.



# అమెరికా ఎయిర్ ఇండియా ఫ్లైట్ మంగోలియాకు మళ్లింపు

శాన్‌ఫ్రాన్సిస్‌కో నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం మంగోలియా రాజధాని ఉలాన్‌బాటర్‌కు మళ్లింది. ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. గాల్లో ప్రయాణిస్తున్న సమయంలో విమానంలో సాంకేతిక లోపం తలెత్తినట్లు సమాచారం. ఫ్లైట్ ఏఐ174 బోయింగ్-777 విమానం ముందస్తు జాగ్రత్త చర్యగా ఉలాన్‌బాటర్ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ అయినట్లు ఎయిర్‌లైన్ సంస్థ ప్రకటించింది. విమానంలోని ప్రయాణికులు, సిబ్బంది అందరూ క్షేమంగా ఉన్నారని తెలిపింది.

శాన్‌ఫ్రాన్సిస్‌కో నుంచి మధ్యాహ్నం 2.47 గంటలకు బయలుదేరిన ఈ విమానం, సోమవారం రాత్రి 9.59 గంటలకు ఢిల్లీలో ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే సాంకేతిక సమస్య కారణంగా మార్గమధ్యంలోనే దారి మళ్లించాల్సి వచ్చింది.

లోపాన్ని పరిశీలించేందుకు ఇంజినీర్లు రంగంలోకి దిగారు. ప్రామాణిక ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ఉలాన్‌బాటర్ విమానాశ్రయంలో ప్రయాణికులకు తగిన సౌకర్యాలు, భోజనం అందజేస్తున్నామని ఎయిర్ ఇండియా తెలిపింది.

# ట్యూషన్‌కి వెళ్లిన బాలికపై ముగ్గురు సామూహిక అత్యాచారం

కోల్‌కతా, నవంబర్ 3బ్యూఫ: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ట్యూషన్ కోసం ఇంటి నుంచి వెళ్లిన 14 ఏళ్ల బాలికపై ముగ్గురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. డమ్‌డమ్ ప్రాంతానికి చెందిన ఆ బాలిక ఏడో తరగతి చదువుతోంది.

శనివారం సాయంత్రం ట్యూషన్‌కు వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరింది. ఈ సమయంలో ఒక పార్క్ వద్ద తెలిసిన వ్యక్తిని కలిసింది. కొద్దిసేపటికే మరో ఇద్దరు వ్యక్తులు అక్కడకు వచ్చారు. ముగ్గురూ కలసి ఆ బాలికను బలవంతంగా ఆటోలో మోతీలాల్ కాలనీలోని ఒక ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ ఆ బాలికపై దారుణంగా అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ రాత్రే బాధితురాలు తప్పించుకుని ఇంటికి చేరి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపింది. వెంటనే వారు పోలీసులను సంప్రదించారు. బాలిక ఫిర్యాదుతో పోలీసులు పోక్సో చట్టంతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా నిందితులుగా సంజు సాహా, విక్కీ పాస్వాన్, రాజేష్ పాస్వాన్‌లను గుర్తించి అరెస్ట్ చేశారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మరింతగా దర్యాప్తు కొనసాగుతోంది.





# డిజిటల్ అరెస్టుపై కఠిన చర్యలు- సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ,**




దేశవ్యాప్తంగా విస్తృతంగా జరుగుతున్న సైబర్ నేరాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. డిజిటల్ అరెస్టు పేరుతో బాధితులు సుమారు మూడు వేల కోట్లు కోల్పోవడం షాకింగ్‌గా ఉందని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ కేసుల్లో కఠినమైన శిక్షలు విధించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. సైబర్ నేరాలకు పాల్పడుతున్న మోసగాళ్లు తమను భద్రతా సిబ్బందిగా, కోర్టు అధికారులుగా, ప్రభుత్వ ప్రతినిధులుగా పరిచయం చేసుకుని బాధితులను బెదిరిస్తున్నారని తెలిపింది. ఆడియో, వీడియో కాల్స్ ద్వారా బాధితులను భయభ్రాంతులకు గురిచేసి, బలవంతంగా డబ్బులు చెల్లించేలా ఒత్తిడి తెస్తున్నారని కోర్టు పేర్కొంది.

చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు ఉజ్వల్ భుయాన్, జోయ్‌మాలా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ కేసులపై విచారణ చేపట్టింది. ఈ అంశంపై సూచనలు అందించేందుకు అమికస్ క్యూరీని నియమించింది. కేంద్ర హోంశాఖ, సీబీఐ సమర్పించిన నివేదికలను కోర్టు పరిశీలించింది.

డిజిటల్ అరెస్టుల ద్వారా సైబర్ నేరగాళ్లు పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయడం అత్యంత ఆందోళనకరమని ధర్మాసనం పేర్కొంది. బాధితుల్లో వృద్ధులు కూడా ఉన్నారని, ఇలాంటి ఘటనలను అరికట్టేందుకు కఠిన ఆదేశాలు ఇవ్వకపోతే పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని తెలిపింది.

భద్రతా సంస్థలను న్యాయ ఆదేశాల ద్వారా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, ఇలాంటి నేరాలపై ఉక్కుపాదం మోపాలని కోర్టు సూచించింది. ఈ కేసులపై నవంబర్ 10న మళ్లీ విచారణ జరగనుంది.

సీబీఐ సమర్పించిన నివేదికలో నేరగాళ్లు విదేశీ ప్రాంతాల నుండి ఈ రకమైన నేరాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నట్టు జస్టిస్ సూర్యకాంత్ వెల్లడించారు. కేంద్రం, సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. హోంశాఖకు చెందిన సైబర్ విభాగం ఈ కేసులను చూసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

హర్యానాకు చెందిన ఒక వృద్ధ మహిళ ఫిర్యాదుతో ఈ కేసు వెలుగులోకి వచ్చింది. తప్పుడు కోర్టు ఆదేశాలు చూపిస్తూ నేరగాళ్లు ఆమెను మోసం చేశారని, కోటికిపైగా మొత్తాన్ని లాక్కున్నారని ఆమె పేర్కొంది. సీబీఐ, ఈడీ అధికారులమని చెప్పి ఆడియో, వీడియో కాల్స్ ద్వారా బెదిరించారని తెలిపింది. ఈ ఘటనపై అంబాలాలో రెండు కేసులు నమోదు అయ్యాయి.

# బెల్జియం సుప్రీంకోర్టును ఆశ్రయించిన మెహుల్ చోక్సీ



పంజాబ్ నేషనల్ బ్యాంకుకు వేల కోట్లు ఎగవేసి విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారి, ఆర్థిక నేరగాడు మెహుల్ చోక్సీ మరోసారి వార్తల్లో నిలిచాడు. ఆంట్వెర్ప్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ బెల్జియం సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.

టీవల ఆంట్వెర్ప్ కోర్టు చోక్సీని అరెస్ట్ చేయడం సరైన చర్యేనని పేర్కొంటూ, భారత్‌కు అప్పగించేందుకు అనుమతి ఇచ్చింది. అక్టోబర్ 17న ఆంట్వెర్ప్ కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ తీర్పుపై బెల్జియం ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని అదే కోర్టు స్పష్టం చేసింది.

తాజాగా చోక్సీ ఈ అవకాశాన్ని వినియోగించుకొని బెల్జియం సుప్రీంకోర్టుకు వెళ్ళాడు. తనపై వచ్చిన తీర్పు అన్యాయమని, అప్పగింత రాజకీయ ప్రేరేపితమని వాదిస్తున్నాడు.

ఇదిలా ఉండగా, ఆంట్వెర్ప్ కోర్టు తన తీర్పులో చోక్సీ చేసిన నేరాలు భారత శిక్షాస్మృతి చట్టం ప్రకారం మాత్రమే కాకుండా బెల్జియం చట్టం ప్రకారం కూడా శిక్షార్హమైనవేనని స్పష్టం చేసింది. చోక్సీపై మోసం, దుర్వినియోగం, ఫోర్జరీ వంటి అభియోగాలు ఉన్నాయని పేర్కొంది.

అప్పగింత రాజకీయ ప్రేరేపితమని, ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరుగుతోందని చోక్సీ చేసిన వాదనలను కోర్టు పూర్తిగా తోసిపుచ్చింది. భారత్‌కు అప్పగించాలన్న ఆదేశం అమల్లో ఉండగా, ఈ కేసులో బెల్జియం సుప్రీంకోర్టు తుది తీర్పుపై అందరి దృష్టి నిలిచింది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in